జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 6-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 475 పేజీలు: 4 వెల : రూ.7



## ఎస్పీ ఆదేశాలు..
# బేఖాతర్!

* పలువురు సీఐలు, ఎస్ఐలపై జిల్లా బాస్ ఆగ్రహం * కొందరు ఎస్‌హెచ్‌వోల కనుసన్నల్లోనే సీడీరైటర్లు, ఈకాప్స్ విధులు * కేవలం పోలీస్‌స్టేషన్లకే పరిమితం * బందోబస్తు డ్యూటీ వేయకపోవడంతో ఎస్పీకి కొందరు ఫిర్యాదు * పీఎస్‌లలో సీడీ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లదే పెత్తనం

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 5 (వార్త):** జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు ఏకంగా ఎస్పీ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. కొందరు ఈకాప్స్, కంప్యూటర్ ఆపరేటసర్లు, సీడీ రైటర్లు పోలీస్‌స్టేషన్‌కే పరిమితమవుతున్నారు తప్ప బందోబస్తు డ్యూటీలకు అస్సలు వెళ్లడం లేదు. ఎస్ఐలు, సీఐలు సైతం వారికి నచ్చిన వారినే స్టేషన్లలో ఉంచుతుండడంతో వీరు పెత్తనం సాగిస్తున్నారు. స్టేషన్‌కు మేమే బాస్‌లు అన్నట్టుగా హవా సాగిస్తున్నారు. స్టేషన్ బాధ్యతంతా మేమే చూస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. బందోబస్తు డ్యూటీలకు ఎగనామం పెడుతున్నారన్నారు. కేవలం ఇండోర్ డ్యూటీకే పరిమితమవుతున్నారు. మరికొందరు సీడీ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు అయితే యూనిఫారాలు కూడా వేయరన్న గుసగుసలు ఉన్నాయి. డీఎస్పీ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ తొమ్మిదేళ్లుగా పాతుకుపోయాడు. కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్నదన్న నెపంతో ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు కొందరు ఎటువంటి బందోబస్తు డ్యూటీలకు వెళ్లడం లేదు. కొందరైతే పోలీసులు ఎవరెవరు ఏయే విధులు నిర్వహించాలో వీరే చెబుతుండడంతో పలుమార్లు పోలీస్‌స్టేషన్లలో స్వల్ప వివాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. సీడీ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మాపై పెత్తనం చలాయించడం ఏంటని కొందరు సీనియర్ పోలీసులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఇదే విషయమై కొందరు జిల్లా పోలీస్ బాస్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. దీంతో ఎస్పీ ఇటీవల సీఐలు, ఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇకపై ప్రతి ఒక్క కానిస్టేబుల్‌కు కంప్యూటర్ శిక్షణ ఇవ్వాలని, అందరికీ బందోబస్తు డ్యూటీ వేయాలని ఆదేశాలు మౌఖికంగా జారీ చేసినట్టు తెలిసింది. ఎవరెవరు బందోబస్తుకు వెళ్లారు, ఎవరెవరు ఎగనామం పెట్టారన్న దానిపై జాబితా ఇవ్వాలని సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.



## ఏ ఒక్క రైతుకు..
# అన్యాయం చేయం

* అనుమానాలు, సందేహాలు ఉంటే నివృత్తి చేస్తాం
* రైతులకు కింజరాపు, గౌతు కుటుంబాలు అండగా ఉంటాయి * అన్నీ అనుకూలిస్తే ఐదేళ్లలో నిర్మిస్తాం
* ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉద్దానం రూపురేఖలు మారుతుంది * వేలమందికి ఉపాధి కలుగుతుంది
* పోర్టు వద్దని గ్రామాలకు వచ్చే వారికి ఉపాధిపై నిలదీయండి
* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**పలాస, అక్టోబరు 5 (వార్త):** ఎయిర్‌పోర్టు రావడం వల్ల ఉద్దాన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.. స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయి.. నిరుద్యోగ సమస్య కొంత తీరుతుంది.. ఏ ఒక్క రైతుకు కూడా నష్టం జరగనివ్వను.. అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భరోసా ఇచ్చారు. ఉద్దానంలో కొబ్బరి ఎదిగేట్టు ఈ ఎయిర్పోర్ట్ ఎదగాలని కోరారు. ఎయిర్‌పోర్టు రావడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం పలాసలోని రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. మందస మండలం బిడిమి, మెట్టూరు, చీపురుపల్లి, భేతాళపురం, లక్ష్మీపురం తదితర గ్రామాల నుండి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సర్వే విషయంలో కూడా ఏ గ్రామంలో ఎంతమేర భూమి అవసరం ఉన్నదన్న విషయంలో స్పష్టత ఇవ్వాలని వారంతా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఉద్దానం ఎయిర్‌పోర్టును మూలపేట పోర్టుకు అనుసంధానం చేయడం వల్ల ఉద్దానంతో పాటు శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మారిపోతాయన్నారు. ఎయిర్పోర్ట్ నిర్మాణ ఆలోచన ప్రాథమిక అంచనా మేరకే పలాసలో అని నిర్ణయం తీసుకున్నామని, పూర్తి స్థాయి సర్వే జరిగిన తరువాతనే దాని భౌగోళిక స్వరూపం తెలిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అధికారుల సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఎవరికైనా అనుమానం ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. రైతులకు కింజరాపు, గౌతు కుటుంబాలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రీవెన్స్‌కు ఎక్కువ మంది ఉద్యోగాలు కావాలని అర్జీలు ఇస్తున్నారని, ఎయిర్‌పోర్టు వస్తే ఉద్యోగ సమస్య తీరుతుందన్నారు. ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తూ గ్రామాల్లోకి వచ్చేవారికి ఉపాధి సమస్యను పరిష్కరించాలని అడగాలని రామ్మోహన్ నాయుడు సూచించారు. ఒక్క శంషాబాద్ విమానాశ్రయం వల్ల సుమారు ఐదు లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ అనౌన్స్మెంట్ తరువాత అక్కడి సమీప భూముల రేట్లు ఇరవై రెట్లు పెరిగాయన్నారు. ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో వంద శాతం భూమిని కోల్పోయే వారికి.. తిరిగి కొంత భూమిని అందించే ఆలోచన కూడా ఉందన్నారు. అన్నీ అనుకూలిస్తే ఐదేళ్లలో ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. బరంపురంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ఒడిశాకు చెందిన నేతలు కోరుతున్నారన్నారు. మళ్లీ ఇలాంటి సువర్ణావకాశం రాదని, అందరినీ ఒప్పించి, మెప్పించి ఉద్దానంలో విమానాశ్రయ నిర్మాణాన్ని చేసి తీరుతామన్నారు.



### అపోహలు వద్దు: మంత్రి అచ్చెన్న

మందస మండలంలో ప్రతిపాదిత విమానాశ్రయం నిర్మాణానికి అందరి ఆమోదయోగ్యంతోనే ముందడుగు వేస్తామని, అపోహలను నమ్మకుండా పూర్తి విశ్వాసంతో సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విమానాశ్రయం నిర్మాణం వల్ల అనుసంధానంగా పరిశ్రమలు, మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల పొల్యూషన్ ప్రభావం ఉంటుందన్న అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. మూలపేట పోర్టు నిర్మాణం వల్ల ఆ ప్రాంతంలో ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. ఎయిర్పోర్ట్ నిర్మాణం వల్ల ఏ గ్రామం కూడా పోవడం లేదని స్పష్టం చేశారు. 2013 భూచట్టం ప్రకారం రైతుల నుండి భూసేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలాస శాసనసభ్యులు గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ట్రైనీ సహాయ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్, ఆర్డీఓ జి.వెంకటేష్ పాల్గొన్నారు.



## రామకృష్ణపురంలో స్వచ్ఛ భారత్

**పలాస, అక్టోబరు5(వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పలో భాగంగా సత్యసాయి బాబా శత వార్షిక జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈనెల2 నుంచి 20 వరకూ సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన 125 మందితో రామకృష్ణపురంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాళాసు శ్రీను, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, ప్రైమరీ ఇన్చార్జ్ సూర్యతేజ, ఉపాధ్యాయులు అనుదీప్, లావణ్య కృష్ణ, ప్రవీణా, మమతా, వార్డెన్లు చంద్రశేఖర్, పురుషోత్తం, మౌనిక, అనిత, పీఈటీ గురునాథ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

*** భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి * గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్**

**మందస, అక్టోబరు 5(వార్త):** గిరిజన శక్తి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మందస మండలంలోని కొండలోగాంలో సమావేశం నిర్వహించారు. మండల గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల పరిధిలోఉన్న చాపరాయికాలనీ గ్రామంలో గిరిజనేతరుడైన ఓ హెూటల్ యజమాని ఆక్రమణలో బీడీఆర్ భూమి సుమారుగా 2ఎకరాలు, అదేవిధంగా జిరాయతి భూములను సుమారుగా విస్తీర్ణం 3ఎకరాలు భూములు, గోపిటూరు గ్రామంలో సుమారుగా 10ఎకరాలు గల రైతులు అనుభవంలో ఉన్న బీడీఆర్ భూములను బలవంతంగా కొంతమంది కబ్జా చేశారని ఆరోపించారు. కొండలోగాం, టబాగాం గ్రామ పరిధిలో ఉన్న అక్రమ క్వారీ నిర్వహణ, ఎన్ హెచ్5 నుండి వయ కొండలోగాం మీదుగా కిల్లోయి కాలనీ బీటీ రోడ్డు వరకు రోడ్ నిర్మాణం, బస్ రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. మందస మండలంలోనే ఐటీడీఏను స్థాపించాలని, ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీని నిర్వహించాలని, చాపరాయి గ్రామ రైతులు అమరావతి యజమాని సుదర్శన్ యాదవ్, అతని



గ్యాంగ్‌పై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం జరగాలని, జరిగేవరకు పోరాటం సాగుతుందని వారు హెచ్చరించారు. సమావేశంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, ఉపాధ్యకుడు ఎస్.శాంతారావు, ఎస్.బాలకృష్ణ, ఎస్.దశరథి, ప్రధాన కార్యదర్శులు ఎస్.హరికృష్ణ, ఎస్.నవీన్, జిల్లా మానవహక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణరావు, ఉప కార్యదర్శి ఎస్.గున్నయ్య, జిల్లా రైతుకూలీ సంఘం కార్యదర్శి కె.రమేష్, మాజీ సర్పంచ్ ఎస్.జగ్గారావు, సంఘం సభ్యులు ఎస్.తులసిరావు, ఎస్.లక్ష్మణరావు, ఎస్.రామారావు, ఎస్.జయరాజు, ఎస్.మాధవరావు, నారాయణరావు, ఎస్.నరసింగులు, ఎస్.పున్నయ్య, ఎస్.కుశరాజు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటిన గో గ్రీన్

**మందస, అక్టోబరు 5(వార్త):** గో గ్రీన్ మందస ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మందస బస్టాండ్ నుండి బజార్ జంక్షన్ వరకు మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రతీ ఆదివారం ఉదయం 7గంటల నుండి 8గంటల వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు గిన్ని తిరుపతిరెడ్డి, సేనాపతి కిషోర్ కుమార్ తెలిపారు. ముందుగా అమూల్య పాణిగ్రహి, నిర్మల్ పాణిగ్రహి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడం భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూర్చే వాళ్లమవుతామని లావేటి ఆనంద్, అల్లాడ తాతయ్య పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటాలని ఈ సందర్భంగా మేడిమి శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. బజారువీధి జంక్షన్ లో మామిడి కోదండరావు, శ్రీనివాస్ పాడి, బుడకల రవి మొక్కలు నాటి వాటికి రక్షణ గార్డులు అమర్చారు. సాయిమోహన్ రిసోర్స్ ఫౌండేషన్ డైరెక్టర్ పట్నాల మోహనాచారి ఆర్థిక సహకారంతో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో రామారావు, పాపారావు, హరి పాల్గొన్నారు.

## హరిపురంలో భావ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం



**మందస, అక్టోబరు 5(వార్త):** గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు, లయన్స్ కోస్టల్ ఆధ్వర్యంలో హరిపురంలో గల కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఆదివారం భావ ఆయుర్వేద(కేరళ) ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నందనసాయిరెడ్డి, గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కొర్ల కన్నారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మార్పు వెంకటేశం, భైరిశెట్టి గున్నయ్య, వైఎస్ఎన్ మూర్తి, మండెల్లి లక్ష్మణరావు, జన్నారావు, భానోజి, పుల్లా వాసుదేవు తదితరులు పాల్గొన్నారు.

## 14న ఉచిత కంటి వైద్య శిబిరం

**కోటబొమ్మాళి, అక్టోబరు5 (వార్త):** సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కోటబొమ్మాళి సత్యసాయి సేవా సమితి, శ్రీకాకుళానికి చెందిన జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే ఈనెల 14వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని సత్యసాయి సేవా కమిటీ సభ్యులు తెలిపారు.

## నేడు సొండిపూడిలో గ్రామసభ

**మందస, అక్టోబరు 5(వార్త):** సొండిపూడిలో సోమవారం గ్రామసభ జరుగుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు యానాది వాసుదేవు చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ గ్రామసభకు తహశీల్దారు హాజరవుతున్నారన్నారు. సొండిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో గల భూముల రీసర్వే జరుగుతుందని, దీనికి సంబంధించి చర్చ జరుగుతుందన్నారు. రైతులు, గ్రామ పంచాయతీ ప్రజలు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## ఎన్టీఆర్ కాలనీలో ఖాళీ స్థలం కబ్జా



**టెక్కలి, అక్టోబరు 5 (వార్త):** టెక్కలి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో ఖాళీ స్థలం కబ్జాకు గురైంది. 1998వ సంవత్సరంలో రైతుల ఆధీనంలో ఉన్న దేవస్థాన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1,140 మంది పేదలకు ఈ స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించి పట్టాలు పంపిణీ చేసి ఆ ప్రాంతాన్ని ఎన్టీఆర్ కాలనీగా పేరుపెట్టింది. పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న 2, 3, 4, 5, 6 వీధులకు గాను లేఅవుట్‌లో 30 అడుగుల విస్తీర్ణంలో నడక మార్గం ఖాళీగా ఉంచి ప్లాట్లుగా అప్పటి అధికారులు విభజించారు. అయితే కొందరు వ్యక్తులు ఆ స్థలంలో అనధికార నిర్మించేశారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు ఈ కబ్జాలను తొలగించింది. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న వీధులకు 20 అడుగుల రోడ్లను మంజూరు చేయగా, ఆ రోడ్డు నిర్మాణం ప్రస్తుతం వేగంగా కొనసాగుతోంది. అయితే, అదే ప్రాంతంలో పోలీస్ స్టేషన్ వెనుక 5వ లైన్‌లో కాలనీకి చెందిన ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించేసి నిర్మాణం చేపడుతున్నాడు. అయితే ఆ వ్యక్తికి గతంలోనే దేవస్థాన భూమిలో సాగు చేసినందుకు గాను మరో స్థలంలో ఇళ్ల నిర్మాణానికి గాను ఇంటి పట్టా మంజూరైంది. ఈ పట్టాను చూపించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు అదే వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆ ఖాళీ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని, లైబ్రరీ, కమ్యూనిటీ సెంటర్‌కు కేటాయించాలని ఎన్టీఆర్ కాలనీవాసులు కోరుతున్నారు.

## ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

**పోలాకి/జలుమూరు, అక్టోబరు5 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మొండివైఖరి అవలంబిస్తుందని, ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలు కూడా చెల్లించకుండా 16 నెలల నుండి కాలయాపన చేస్తూ ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా పోలాకి మండల ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, పిఆర్సి కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి 30శాతం చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించవలసిన పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని, డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు వినియోగించకూడదన్నారు. ఈనెల ఏడవ తేదీన చలో విజయవాడ ధర్నా కార్యక్రమం ఏర్పాటు కోసం సన్నద్ధ కార్యక్రమంలో భాగంగా పోలాకి మండలంలోని ఫ్యాప్టో సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించి వాటి పై ఉపాధ్యాయులతో చర్చించారు. పోలాకిలోని హాస్పిటల్ రోడ్డు నుండి, ఎంఆర్ సి వరకు ఈ బైక్ ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర సభ్యులు చింతాడ దిలీప్ కుమార్, పోలాకి మండలం ఫ్యాప్టో అధ్యక్షుడు చింతాడ ధర్మారావు, కార్యదర్శి ఉమాశంకర్, సభ్యులు బమ్మిడి జితేంద్ర, చమళ్ళ వెంకటేష్, ఆర్ శ్రీనివాసరావు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు వల్లంనాయుడు, కిల్లి సింహాచలం, షణ్ముఖరావు, నరసింహులు, గుంటుకు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పలాస, అక్టోబరు5(వార్త):** విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస మండలం 33 కేవీ స్తంభాలు వేయుటకు శ్రీనివాసనగర్, పాత జాతీయ రహదారి రోడ్, మండల పరిషత్ కార్యాలయం, ఎస్ ఎఫ్ఎస్ స్కూల్ పరిసరాలు, ఇంగిలిగం, ఇండస్ట్రియల్ ఏరియా తదితర ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా

**పోలాకి/జలుమూరు, అక్టోబరు5 (వార్త):** పోలాకి మండలంలోని బెలమర, పాలవలస గ్రామంలో వైసీపీ నేత ధర్మాన కృష్ణచైతన్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, రాష్ట్ర యువజన కార్యదర్శి చింతు రాఘవ, మండల బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమా మహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, చింతు సింహాచలం, ఎంపిటిసి పైల మల్లేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు రావాడ అప్పన్నరాజు, చింతు రామక్రిష్ణ పాల్గొన్నారు.




## మద్యం తాగి వాహనాలు నడపొద్దు

**పోలాకి/జలుమూరు, అక్టోబరు5 (వార్త):** మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పోలాకి ఎస్ఐ రంజిత్ తెలిపారు. శనివారం రాత్రి పోలాకి మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



## పంట పొలాల్లో ఇసుక మేటలు

**పలాస, అక్టోబరు5(వార్త):** ఇటీవల కురిసిన వర్షాలకు గిరిజన ప్రాంతాలైన లొత్తూరు, హిమగిరి, దానాగొర గ్రామాల్లోని పంటపొలాల్లోకి కొండల నుంచి వచ్చిన మట్టి, గెడ్డలు, ఇసుక చేరింది. దీంతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు మా భూములను పరిశీలించి నష్టపరిహారం ఇచ్చేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.



## హరిపురంలో వంశధార సాగునీరు కమిటీ సాధన సమావేశం



**మందస, అక్టోబరు 5(వార్త):** హరిపురంలో గల మార్పు గ్రంథాలయంలో వంశధార సాగునీరు సాధన కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. భవిష్యత్ కార్యాచరణపై నాయకులు చర్చించారు. ఉద్దాన గ్రామాలు వంశధార సాగునీరు పరివాహక గ్రామాలు పర్యటనకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావు, అంపోలు త్రినాధరావు, ఉగ్రిపిల్లి సోమనాదం, కొవ్వూరు దాశరధి, వెదుళ్ల మాధవ రావు, రాపాక నారాయణరావు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 10న మెగా జాబ్‌మేళా

**శ్రీకాకుళం, అక్టోబరు 5 (వార్త):** జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న శ్రీకాకుళం అభ్యుదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న ఈ మేళాలో ఏసిఎన్ హెల్త్ కేర్, కాన్సెంట్రిక్స్, ఆరబిందో, కియా మోటార్స్, హెట్రో, స్పైడర్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర 18 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని వెయ్యికి పైగా ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నాయని ఆయన వివరించారు. ఎస్ఎస్‌సీ నుండి డిగ్రీ వరకు చదివిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకుని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ప్రతులు, ఫోటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్‌ను 9704960160, 6301045132 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

# గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**సంతబొమ్మాళి, అక్టోబరు5(వార్త):** గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం సంతబొమ్మాళి మండలంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడ్డాయన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘ నిధులను వేరే వాటికి మళ్లించడంతో గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. గత ఐదు సంవత్సరాల్లో గ్రామాలకు కనీస మౌలిక సదుపాయలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేపట్టిందని, గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామాలన్నీ ప్రగతి పథంలో పయనించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పలు గ్రామాలకు అనుసంధానంగా రహదారులు వేస్తున్నామన్నారు. డీఎన్ పురం నుంచి ఉద్దండపాలెంకు రూ.87 లక్షలతో బీటీ రహదారి పనులకు శంకుస్థాపన, డీపీఎన్ నుంచి పాలతలగాం రూ. ఒక కోటి 10 లక్షలతో బీటీ రహదారి పనులకు శంకుస్థాపన, బోరుభద్ర ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులకు రూ.67 లక్షలు పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.


## మృతుల కుటుంబానికి నష్టపరిహారం అందజేత



**మందస, అక్టోబరు 5(వార్త):**ఇటీవల భారీ వర్షాలకు మందస మండలంలోని హంసరాలి పంచాయతీలో గల సవరచినటుబ్బూరు గ్రామానికి చెందిన సవర బుదయా, రూపమ్మ దంపతులు గోడ కూలి మృతి చెందారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మృతులకు ఒక్కొక్కరికీ రూ.4లక్షలు చొప్పున రూ.8లక్షల నష్టపరిహారం ప్రకటించింది. కుటుంబ సభ్యులకు పరిహారంగా ఒక్కొక్కరికి రూ.4లక్షలు చొప్పున ఇద్దరికీ రూ.8లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరిష అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నియోజవర్గం, మండల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన

**పలాస,అక్టోబరు5(వార్త):**పలాస రైల్వేస్టేషన్‌కు ఆనుకుని నిర్మాణం జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను ఆదివారం కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పరిశీలించారు. నిర్వాసితులతో, అధికారులతో వారు మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. వారి వెంట జిల్లా కలెక్టర్ స్వప్నిల్, దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, పలాస ఆర్డీవో వెంకటేష్, ఏపి టీపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసి చైర్మన్ మల్ల శ్రీనివాస్, టీడీపీ నేతలు పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.





## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

**పాతపట్నం, అక్టోబరు5 (వార్త):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశధార, మహేంద్ర తనయ నదులు ఉధృతంగా ఉప్పొంగి నదీ పరివాహక గ్రామాలు, పంట పొలాలు అతలాకుతలం చేశాయి. హిరమండలం మండలం తుంగతంపర, గులుమూరు, జిల్లోడు పేట గ్రామాల్లోని పంటలు ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సందర్శించి పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వమే పరిహారం అందిస్తుందని రైతులకు భరోసా కల్పించారు. ఆయన వెంట రైతులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, అక్టోబరు5(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## పేకాట స్థావరంపై కంచిలి పోలీసులు దాడి


**శ్రీకాకుళం,అక్టోబరు5 (వార్త):**కంచిలి మండలం, సూదిపుట్టుగ గ్రామంలో పేకాట ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.92,960ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే ఈనెల 4న రాత్రి 11.30గంటలకు సూదిపుట్టు గ్రామంలోని ప్రేమ్ డోలాయ్ ఇంటిపై ముందస్తు సమాచారంతో కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు, తన సిబ్బంది దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.92,960, 13 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా పేకాట ఆడినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## అమ్మవారిని దర్శించుకున్న దాసునాయుడు



**పోలాకి/జలుమూరు, అక్టోబరు5 (వార్త):**పోలాకి మండలం సుసరం గ్రామంలో దుర్గ భవాని అమ్మవారిని ఆదివారం జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసు నాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.


# ఘనంగా దుర్గమ్మ నిమజ్జనోత్సవం





**శ్రీకాకుళం, అక్టోబరు 5 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని బలగ హడ్కో కాలనీలో కేబీటీ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా దుర్గమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆదివారం దుర్గమ్మకు పూజలు చేసిన అనంతరం నిమజ్జనోత్సవం నిర్వహించారు. డీజే నడుమ దుర్గమ్మను ఊరేగించి వంశధార నదిలో నిమజ్జనం చేశారు. యువత ఈ ఊరేగింపులో నృత్యం చేశారు.





## నేడు స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానం

* రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు
* జిల్లా స్థాయిలో 14 కేటగిరీలలో 46 అవార్డులు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, అక్టోబరు5(వార్త):** స్వచ్ఛ ఆంధ్రా అవార్డుల ప్రధానోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు వచ్చాయన్నారు. ఇందులో స్వచ్ఛ హాస్టల్ కేటగిరీలలో ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల(గర్ల్స్) నేలబొంతు, శ్రీకాకుళం-1, స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ కేటగిరీలో గౌరీ శంకర మహిళా సమాఖ్య, వార్డు నంబర్ 26, శ్రీకాకుళం-1కు వచ్చాయన్నారు. జిల్లా స్థాయిలో 14 కేటగిరీలలో 46 అవార్డులు వచ్చాయని తెలిపారు. ఇందులో ఉత్తమ స్వచ్ఛతా హరిత అంబాసిడర్లు-5, ఉత్తమ స్వచ్ఛతా యోధులు-5, స్వచ్ఛ్ అంగన్వాడీలు-5, స్వచ్ఛ్ బస్ స్టేషన్లు-1, స్వచ్ఛ్ ప్రభుత్వ కార్యాలయాలు-3, స్వచ్ఛ్ గ్రామ పంచాయతీలు-5, స్వచ్ఛ్ ఆసుపత్రులు-4, స్వచ్ఛ్ పరిశ్రమలు (పెద్ద/మెగా)-3, స్వచ్ఛ్ మునిసిపాలిటీలు-1, స్వచ్ఛ్ నివాస పాఠశాలలు-1, స్వచ్ఛ్ రైతు బజార్లు-1, స్వచ్ఛ్ పాఠశాలలు-5, స్వచ్ఛ్ ఎస్ఎల్ఎఫ్-2, స్వచ్ఛ్ గ్రామ సంస్థలు-5లకు అవార్డులు వచ్చినట్లు వివరించారు. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతోందన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546